# కావ్యగానం

"స్నానానికి లేవండి. రామం మీ కోసం కనిపెట్టుకున్నాడు. మనవడు ఒళ్ళో ఉంటే తిండీ తిప్పలమీద ధ్యాస ఉండదేమో" అని కేకవేసింది కామాక్షమ్మ. శివరామయ్య వినిపించుకున్నట్టులేదు. "మిమ్మల్నే" అని కాస్త స్థాయి పెంచింది. ఆ కేకకు ఒడిలో ఉన్న పసివాణ్ణి భుజంమీద కెత్తుకుని పరుగులాంటి నడకతో బాల్కనీలోంచి లోపలకు వెళ్ళాడు. శివరామయ్య అందగాడా అని అడుగుతే వెంటనే జవాబు రాకపోవచ్చు. కానీ, పై వరుసలో ఒక పన్నూ క్రింద వరసలో ఒక పన్నూ రాలిన నోటిని తెరిచి నిశ్చింతగా, నిండుగా, నిరామయంగా నవ్వుతూ ఉంటే ఎవ్వరికైనా మరోసారి శివరామయ్యను చూడాలనిపిస్తుంది. అతని గడ్డం మరీ అబ్రహం లింకన్ గడ్డంలా పల్చగానూ ఉండదూ ఠాగోర్ గడ్డంలా అంత ఒత్తుగానూ ఉండదు. మధ్యస్తంగా ఉంటుంది. చిక్కటి పాలలో నానబెట్టి ఆరబెట్టినట్టు తెల్లగా ఉంటుంది. వేలాడే మీగడ తరకల్లా ముచ్చటగా ఉంటుంది. బొద్దు మీసాలు పై పెదవిమీద చీలి గడ్డంతో పెనవేసుకుపోతాయి. కొనతేలిన ముక్కును ఆరు నెలలు నిండిన మనవడి బొజ్జకు రాస్తూ గిలిగింతలు పెడుతూ కళ్ళలోకి చూసి కవ్విస్తూ ఉంటే పసివాడు కిలకిల నవ్వుతూ ఆయాసపడిపోతూ ఉంటాడు. ఇలా

పెల్లుబికే మమతల వెల్లువలో పడి వాళ్ళిద్దరూ కొట్టుకుపోతూ ఉంటే ఇంక చుట్టూ వున్న ప్రపంచం సంగతి వాళ్ళ ఇద్దరికీ పట్టదు. ఒక తరానికీ ఇంకో తరానికీ వున్న అంతరం మాయమై పోతుంది. శ్రావణ మాసంలో నీటి మబ్బులు నింగినీ నేలనూ ఏకం చేసినట్లుంటుంది. అరవై ఐదేళ్ళ జీవితానుభవమూ అర్ధ సంవత్సరం బాహ్య ప్రపంచాన్ని చూసిన పసితనం ఒక్కటై విడతీయలేనంతగా చిక్కుపడి పెనవేసుకుపోతాయి. ఇంతటితో సరిపోదు. శివరామయ్య నోట అప్రయత్నంగా, అనర్గళంగా కవితావేశంలాటిది పొంగి లయ బద్ధంగా యతిప్రాసలతో తిట్లూ దీవెనల రూపంలో ప్రవహిస్తుంది. పింజారి వెధవా—పేచీకోరు వెధవా, బుచ్చి వెధవా, బూడిద గుమ్మడి వెధవా, అల్లరి వెధవా—ఆకతాయి వెధవా—ఇలా వాడిన పదం వాడకుండా కావ్యగానం సాగుతుంది. ఒళ్ళో మనవణ్ణి పెట్టుకుని ముందుకూ వెనక్కూ శివరామయ్య కదులుతూ వుంటే గుర్రం ఎక్కినట్లు తాతతోపాటూ ఊగిపోతాడు మనవడు. కాస్త ఊపూ పాటా ఎందుకైనా ఆగుతే తల ఎత్తి తాత ముఖంలోకి చూస్తాడు 'ఎందుకు ఆపేశావు' అని అడిగినట్లు.

రాకరాక మూడవ కొడుకు రామం దగ్గరకు భార్యతో కలసి వచ్చాడు శివరామయ్య. మనవడికి కోడలు పాలు కుడిపి ఒళ్ళుతుడిచి, పౌడర్ వేసేదాకా కాలుకాలిన పిల్లిలాగ వరండాలో తిరుగుతూ వుంటాడు బాల్కనీలో నిలబడి, పుస్తకాల సంచులు వీపుమీద వేలాడేసుకు పోతున్న పిల్లల్ని చూస్తూ ఉంటాడు. తరువాత మనవణ్ణి కోడలి దగ్గర నుండి అందుకుని వాలు కుర్చీలో కూర్చుంటాడు. ఇంక కాలగమనం గుర్తుండదు. ఒడ్డును తాకుతున్న సముద్ర కెరటాలను విసుగు లేకుండా చూస్తూ గడిపే తాత్త్వికుడిలాగ మనవడి కాటుక

కళ్ళలోకి చూస్తూ, నవ్వితే సొట్టపడే బుగ్గల్ని నిమురుతూ మైమరచి పోతాడు. ఇంక ధారావాహికంగా వచ్చే కావ్యగానం సరేసరి

కొడుకులందరిలో కాస్త పెద్ద ఉద్యోగం రామానిది. కోడలు పిల్ల కూడా పెద్ద చదువే చదివి ఉమెన్స్ కాలేజీలో పనిచేస్తోంది. ఎప్పుడూ ఏదో పుస్తకంతో కాలం గడుపుతుంది. కాస్త పాతకాలం చదువూ సంప్రదాయం కామాక్షిది. ఆ కారణంగా మిగతా కోడళ్ళతో ఉన్నంత చనువు కామాక్షికి రామం భార్యతో లేదు.

రోజూ తాత మనవడితో కలిసి చేసే హడావిడికి కోడలు అప్పు డప్పుడు రుసరుస లాడినట్లు కామాక్షమ్మకి తోచింది. కానీ ఆమె గమనించినంతగా శివరామయ్య పట్టించుకోలేదు. గట్టిగా నాన్నగారితో ఎదురుపడి ఎలా చెప్పాలో రామానికీ తెలియలేదు. "ఎంత ముద్దయినా అవేమి కేకలూ తిట్లూ. డ్రాయింగ్ రూమ్‌లోకి వినిపిస్తున్నాయి. ఎవరైనా వింటే నవ్వుతారు. నాన్నగారితో నువ్వైనా చెప్పవ్" అని తల్లితో నసిగాడు ఒకరోజున. చేర్చవలసిన విధంగా భర్తకు సమా చారాన్ని చేరవేసింది కామాక్షమ్మ. ఆనందంగా రోజులు ఘడియల్లా దొర్లిస్తున్న శివరామయ్యకు ఈలాంటి చిన్న సైజు సమస్య ఎదురౌ తుందని ఊహించలేదు పాపం. కాస్త చిన్న బుచ్చుకున్నాడు. పట్టుగా రెండు రోజులు పసివాణ్ణి తాకలేదు. పిల్ల వెధవ కూడా బిక్కు బిక్కు మంటూ ఏదో పెన్నిధిని పోగొట్టుకున్నట్లు ఏడ్చి తల్లినీ తండ్రినీ విసిగించాడు. మూడవ రోజు మెల్లిగా కామాక్షికి సౌజ్ఞచేసి మనవణ్ణి అందుకున్నాడు- శివరామయ్య. రెండు నిముషాలు మాట పాట లేకుండా వాడి ముఖంలోకి చూశాడు. నవ్వుతూ మీసాలు పీకు తున్న పసివాణ్ణి చూడగానే కవితావేశం కట్టలు తెంచుకుని పొంగి పొర్లింది. శివరామయ్య నిగ్రహం మాయమైంది. కోడిబుర్ర వెధవా

కొక్కిరాయ వెధవా అంటూ లయబద్ధంగా ఊగిపోసాగాడు. స్నానం చేసి వచ్చి పసివాడి కోసం వెతుక్కుంటున్న కోడలు పిల్ల బాల్కనీలోకి తొంగిచూడడంతో ఏదో తప్పుచేసిన వాడిలాగ మౌనముద్ర వహించాడు. కామాక్షమ్మ వెళ్ళి మనవణ్ణి అందుకుని పాలు పట్టడానికి లోనికి తీసుకు పోయింది. బాల్కనీలో నిలుచుని అలా ఆకాశంలో తేలిపోతున్న తెల్లని మబ్బులు చూస్తూ గతంలోకి జారుకున్నాడు శివరామయ్య. తన బడిపంతులు బ్రతుకులో అప్పుడప్పుడు వింతగా వెంటాడిన ఒక చిన్న బలహీనత ఇలా మళ్ళీ ఇన్నేళ్ళకు తొంగి చూసి పలకరించిన కారణంగా శివరామయ్య కాస్త సిగ్గుపడక పోలేదు.

టీచర్లందరిలాగా శివరామయ్య చేతిలో బెత్తం పుచ్చుకున్నట్లు కానీ తమాషాగా ఒక దెబ్బ వేసినట్లు గానీ ఏ విద్యార్థికీ గోపాలపురంలో గుర్తుండదు కానీ, అతని తిట్లు తినకుండా స్కూల్లో చదివి బయట పడ్డవాడు లేడు. బతక లేక బడిపంతులు అన్న సామెత వాడుకలో ఉన్న పాత రోజుల్లో సబ్ రిజిష్ట్రారు ఆఫీసులో లాభసాటి గుమస్తా ఉద్యోగం వద్దని బడిపంతులుగా స్థిరపడ్డ శివరామయ్యని చూసి తోటి వాళ్ళు నవ్వుకోక పోలేదు. అలాంటి శివరామయ్య పళ్ళు గట్టిగా బిగించి మంచికీ చెడ్డకీ కూడా తిట్టడం, ఏకబిగిని కవితాగానం చెయ్యడం ఒక కళగా అభ్యసించాడా అనిపించేది. "లెక్కలు చేసుకుని వచ్చేవురా కొక్కిరాయ వెధవా" అనేవాడు ఒకణ్ణి. "నువ్వు ఉత్తి చవటవని మోసపోయానురా. చాపకింద నీరువనుకోలేదు చమత్కారి వెధవాయ్. ఏమీ ఎరగనట్లుండి నూటికి నూరు కొట్టేశావ్. నేను ఎవ్వరికి ఇచ్చి ఎరగను అన్ని మార్కులు ఏం చెయ్యను. అన్నీ కరెక్టే మరీ" అని పుప్పొంగిపోయి తిట్టేవాడు ఇంకొకణ్ణి. ఈ తిట్లకూ దీవెనలకూ అలవాటుపడి బడిపిల్లలు ముసిముసి నవ్వులు కురిపించేవారు. అలాంటి ఆనందంలోనే ఎవరో కొందరు పిల్లలు టీ. ఎమ్ (తిట్ల మాష్టారు అనే

పదాలకు సంక్షిప్త రూపం) అని ముద్దు పేరుగా పెట్టుకున్నారు. రోజూ పొద్దున్నే అటెండన్స్ రిజిష్టరులో పొట్టి సంతకం పెట్టినప్పుడు శివరామయ్య తన పూర్తిపేరు చూసుకునేవాడు. పోస్ట్‌మన్ ఉత్తరాలు అతని పేరు చదివి ఇచ్చేవాడు. మిగతా వ్యవహారాలకు పిల్లలు పెట్టిన పేరే చలామణి అయ్యేది. తోటి టీచరూ హెడ్‌మాష్టారూ కూడా పరోక్షంగా అతని ప్రస్తావన తేవలసి వచ్చినప్పుడు టీ. ఎమ్ అన్న పేరే ధారాళంగా వాడుకునేవారు. గోపాలపుర వాసులు తిట్లమాష్టర్ని తలుచుకున్న సమయాల్లో ఒకటి రెండు సంఘటనలు చెప్పుకుని నవ్వుకోవడం ఇప్పటికీ పరిపాటి. ఇంకా ఈ పేరు అంతగా ప్రచారంలోకి రానిరోజుల్లో ఒక కుర్ర డిప్యూటీ తాసిల్దారు ఆ గ్రామం వచ్చాడు. ఆ రోజుల్లో డిప్యుటీ తాసిల్దారు పెద్ద ఉద్యోగిగా లెక్క. అతని కొడుకు కాస్త ముద్దుగా దర్పంగా పెరిగి గోపాలపురంలోని శివరామయ్య తిట్లకు ముఖం ఇట్టే పెట్టుకున్నాడు. తండ్రితో ఫిర్యాదు చేశాడు. ఆ తండ్రి కొడుకుని తీసుకుని సాయంత్రం శివరామయ్య తలుపు తట్టాడు. తలుపు తీసిన శివరామయ్యకు నీడలో ప్రక్కగా నిలబడి ఉన్న డిప్యూటీ తాసిల్దార్ కనపడలేదు. ఎదురుగా కనపడ్డ పిల్లవాణ్ణి చూసి "ఏమిరోయ్ దొంగబడవా ఇలా దయచేశావ్—దా—" అని చెయ్యిపట్టుకుని ఇంట్లోకి తీసుకుపోబోతూ పక్కనే ఉన్న చెట్టంత మనిషిని చూసి ఆశ్చర్యపోయాడు. ఆ మనిషి ఇంగ్లీషులో గట్టిగా దులిపేసి, "తిట్టకుండా పాఠం చెప్పడం రాదా" అని నిలదీశాడు. నీరసంగా, జాలిగా ముఖంపెట్టి "ఈ పసివాళ్ళని ముద్దుగా తిట్టుకోవడం నా దురలవాటు. క్షమించండి పొరపాటే" అన్నాడు శివరామయ్య— ఇంకేమి చెప్పాలో తోచలేదు. అత్తెసరు మార్కులతో నెట్టుకుని వస్తున్న ఆ పిల్లడు ఎక్కువ మార్కులు తెచ్చుకుంటూ క్రమంగా పబ్లిక్ పరీక్షలో జిల్లా మొత్తంమీద ఎక్కువగా తెచ్చుకున్నాడు. ఒక స్కూల్

ఫంక్షన్‌కూ ఆ పిల్లవాడి తండ్రే గతాన్ని తప్పుకుని అందరి సమక్షంలో చెప్పి శివరామయ్యను క్షమించమని వేడుకున్నాడట.

వేరొక సంఘటన కూడా జ్ఞాపకం తెచ్చుకుంటారు గోపాలపుర వాసులు. అతను రిటైర్ అయిన రోజున స్కూలు పిల్లలేకాక ఊరిలోని పెద్దలూ అభిమానంతో వచ్చారు—వీడ్కోలు సభకు. సభ అంతా కాస్త గంభీరంగానే ఉంది. హెడ్‌మాష్టరు ఉపన్యసిస్తూ మధ్యలో నోటికి చటుక్కున శివరామయ్య అన్న పేరు రాక, టీ. ఎమ్ అని కూడా అందరి ముందూ అనలేక కాసింత తడబడుతూ వుంటే పక్కన కుర్చీలో కూర్చున్న శివరామయ్య టీ. ఎమ్ అని ప్రోమ్టింగ్ చేశాడు. గంభీర ముద్రలో వున్న సభలో నవ్వులవాన కురిసింది. ఇలాంటి జ్ఞాపకాల మబ్బు తెరల్లో మునిగి, శివరామయ్య బాల్కనీలో చిదానం దంగా ఆకాశంవంక చూస్తున్నాడు.

ఏదో లైబ్రరీ పుస్తకాలు తెచ్చుకుని గదిలో తిరగవేస్తున్నాది కోడలు ఏ స్టడీ ఆఫ్ ద ప్రిమిటివ్ ట్రైబ్స్ అన్న పుస్తకంలో ఒక తెగ ప్రజలు వుత్సవంచేసి మనసుతీరా దేవుడి విగ్రహానికి ఎదురుగా తిడుతూ ఉంటారని చదువుతోంది. అక్కడ నక్షత్రం గుర్తుపెట్టి కింద ఫుట్ నోట్‌లో రచయిత "ఇలాంటి విచిత్రమైన సంప్రదాయం ఒకటి నేటికీ జగన్నాథుని రథయాత్ర సందర్భంగా ఒడ్రులు పూరీలో పాటిస్తూ ఉంటారు. ఆ దినం రథం లాగుతూ దేవుణ్ణి ఎంత తిడితే అంత పుణ్యం అనీ, దైవం కూడా ఆ తిట్లను విని ఎంతో సంతోషిస్తాడనీ ఒక నమ్మిక ఉంది" అని వివరణ ఇస్తున్నాడు. ఆ విషయం చదువుకుంటున్న కోడలు పిల్లకు కాస్త నవ్వు రావడమేకాదు. తనమీద తనకే కోపం కూడా వచ్చింది మామగారు పళ్ళు బిగించి మరీ మనవణ్ణి తిట్టడం

జ్ఞాపకం వచ్చింది. అప్పుడే నిద్రలేచి ఏడుస్తున్న కొడుకుని ఎత్తుకుని ఒడిలో కూర్చోబెట్టుకుంది. కాటుక కళ్ళూ విశాలమైన నుదురూ, ఎర్రని బుగ్గలూ చూస్తూ ఉంటే కవితావేశం ఉరకలేసింది. "దొంగ వెధవా దోసకాయ వెధవా" అంటూ శ్రావ్యంగా పలకరిస్తూ, వినివిని కంఠస్థమై పోయిన కావ్యగానం మొదలుపెట్టింది. పసివాడు కిలకిలా నవ్వుతున్నాడు. మనవడు ఏం చేస్తున్నాడో అని వెతుక్కుంటున్న శివరామయ్య కిటికీలోంచి అనుమతి తీసుకోకుండానే తన కావ్య గానాన్ని కాపీ చేస్తున్న కోడల్ని మనవణ్ణిచూసి నిరామయంగా నవ్వుకున్నాడు.

(27-1-90)